క్లుప్తంగా

మహానందీశ్వరస్వామి సన్నిధిలో..



మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన జడ్జి జయలక్ష్మి, సునీల్ దంపతులు

మహానంది: కదిరి జూనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మీ సునీల్ దంపతులు శనివారం మహానంది వచ్చారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామివారి దర్శనార్థం వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేశారు. అనంతరం వారికి స్థానిక యాగశాలలో స్వామి,అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఉత్తమ సేవలకు సన్మానం



వడ్డెమాను పాఠశాలలో ఉద్యోగిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని వడ్డెమాను జెడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై వెళ్తున్న సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం జహీదాబేగం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, రఫి, అల్లిహుసేన్, శివమ్మ, నాగసుశీల తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

జూపాడుబంగ్లా: లైసెన్స్, అనుమతుల్లేకుండా ఎవరైనా టపాసులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ మారుతిశంకర్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతుల్లేకుండా టపాసులు విక్రయించినట్లు తెలిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదన్నారు. టపాసులు విక్రయించదలిస్తే లైసెన్స్ తీసుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టాలి



బొల్లవరంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న పార్టీ నాయకులు

మహానంది: సంక్షేమ సారథి, పేదల పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా పాలమహేశ్వరరెడ్డి కోరారు. బొల్లవరంలో రెండోరోజు శనివారం పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ మేరకు వారు గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు బండి రమణయ్య, బూత్ కమిటీల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు, కందుల వెంకటసుబ్బారెడ్డి, బొల్లవరం రమణ, జమాల్‌బాషా పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న కర్ణాటక డిప్యూటీ సీఎం



కర్ణాటక డిప్యూటీ సీఎంకు స్వామివార్ల జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను కర్ణాటక డిప్యూటీ చీఫ్‌మినిస్టర్ డీకే శివకుమార్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మన్‌రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేద పండితులు ఆశీర్వచనాలు పలుకగా ధర్మకర్తల మండలి చైర్మన్, ఈఓలు స్వామిఅమ్మవార్ల శేష వస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.

బిల్లును ఆమోదించాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించే బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా చూడాలని ఎంవీఆర్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులి కొండన్న కోరారు. శనివారం పెద్దకొట్టాల గ్రామంలో సంఘం జిల్లా స్థాయి నేతలతో సమావేశం నిర్వహించారు.

మొక్కజొన్నపై రైతన్న ఆసక్తి

- రబీలో పెరిగిన సాగు విస్తీర్ణం
- ఆశాజనకంగా మార్కెట్ ధర
- ఆత్మకూరు డివిజన్‌లో 8,022 హెక్టార్లలో సాగు



ఆత్మకూరు వద్ద కళకళలాడుతున్న మొక్కజొన్న పంట

ఆత్మకూరు: ఈ ఏడాది ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాలలో రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న పంట సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మార్కెట్‌లో మంచి ధర పలకడం, మినుము సాగు చేసిన రైతులు తెగుళ్ల కారణంగా నష్టాలు చవిచూడటం, పొద్దుతిరుగుడు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో మొక్కజొన్నవైపే మొగ్గు చూపారు.

వరి కంటే అధికంగా..

రబీ సీజన్‌లో వరి కంటే ఎక్కువగా వాణిజ్య పంట వైపే రైతులు దృష్టి సారించారు. ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడుతో పాటు వెలుగోడు మండలాలలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం అధికంగా ఉంది. ఆత్మకూరు మండలంలో 2,440 హెక్టార్లు, కొత్తపల్లి మండలంలో 1,681, పాములపాడు మండలంలో 1,451 , కొత్తపల్లిలో 2,150 , వెలుగోడు మండలంలో 300 హెక్టార్లలో ఈ పంటను వేశారు.

మార్కెట్‌లో గిట్టుబాటు ధర

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు కోత అనంతరం ప్రభుత్వం మద్దతు ధర కంటే ఎక్కువకు ప్రైవేట్ వ్యాపారస్తులు కొనడంతో రైతులు మళ్లీ ఈ పంట సాగుకే శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం క్వింటా రూ.1900 నుంచి రూ. 2100 లకు పైగా పలుకుతోంది. ఇదే గతేడాది రూ.1900 నుంచి రూ.2వేల దాకా పలికింది.

కత్తెర పురుగు ఆశించినా ఆందోళన లేదు..

ఈ పంటకు కత్తెర పురుగు వ్యాపిస్తోంది. అయినప్పటికీ రైతులు రసాయన, క్రిమిసంహారక మందులు వాడుతూ పంటను రక్షించుకుంటున్నారు. పంటకు కత్తెర పురుగు ప్రారంభమైన వెంటనే క్రిమిసంహారక మందులు స్ప్రే చేయడంతో పాటు ప్రొక్లైన్, నువాన్ తదితర మందులు పిచికారీ చేస్తూ పంటను కాపాడుకుంటున్నారు. ఖరీఫ్‌లో ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్లదాకా దిగుబడి రాగా ప్రస్తుతం ఎకరానికి 20 నుంచి 40 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందని రైతులు భావిస్తున్నారు.

గిట్టుబాటు ధర ఉండడంతో సాగు చేశాం



ఈ ఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్న వేశా. పంటకు గిట్టుబాటు ధర ఉండడంతో రబీలో ఈ పంటనే సాగు చేస్తున్నాం. గతేడాది మినుము పంట సాగు చేస్తే తెగుళ్ల వలన నష్టపోయా. ప్రస్తుతం మొక్కజొన్న పంట వలన అధిక దిగుబడి వస్తుందని భావిస్తున్నాం. అలాగే ప్రభుత్వ మద్దతు ధర కంటే మార్కెట్‌లో అధికంగా ధర ఉంది.

– వెంకటేశ్వర్లు, బాపనంతపురం

పెరిగిన మొక్కజొన్న సాగు



ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో మొక్కజొన్న పంట సాగు పెరిగింది. గతేడాది కంటే దాదాపు 500 నుంచి 1000 హెక్టార్లు అధికంగా సాగు చేస్తున్నారు. రబీలో ఈ ప్రాంత రైతులు మినుము పంటను అధికంగా సాగు చేసే వారు. ప్రస్తుతం మినుము పంట బదులుగా రైతులు మొక్కజొన్న పంటను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ పంటకు ప్రధానంగా కత్తెరపురుగు వ్యాపించే అవకాశం ఉన్నందున నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రైతులు ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి సలహాలు పొందవచ్చు.

– విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఆత్మకూరు

కొలనుభారతిలో 14 నుంచి కార్తీక పూజలు

కొత్తపల్లి: మండలంలోని సరస్వతీ క్షేత్రమైన కొలనుభారతి ఆలయంలో ఈనెల 14 నుంచి కార్తీకమాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మోహన్, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ శనివారం తెలిపారు. ఆలయంలో నెల రోజుల పాటు కార్తీకమాస పూజాకార్యక్రమాలు జరుగుతాయన్నారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, నూతన వస్త్రాలంకరణ, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్తీకమాసం శివుడికి ప్రీతికరమైనది కావున సప్తశివాలయాల్లో అభిషేకాలు, సహస్రనామార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకములు చేపడతామన్నారు. భక్తులకు ఆర్యవైశ్య సత్రంలో అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

సచివాలయంలో పాము కలకలం

మహానంది: బండిఆత్మకూరు గ్రామ సచివాలయంలో శనివారం నాగుపాము కలకలం రేపింది. నాగుపామును చూసిన స్థానికులు సచివాలయం సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు వెంటనే సచివాలయం వద్దకు చేరుకుని పామును చంపేశారు. సెలవురోజు కావడం, ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటు



సీఎస్‌ఐ సమాధుల తోట ఎదురుగా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

నందికొట్కూరు: కాలగమనంలో ఏటా చాల పండగలు రావడం ఆనందాలు అందివ్వడం సర్వసాధారణం. వీటిలో దీపావళి పండుగను కులమతాలకతీతంగా ప్రజలు ఎంతో ఆనందోత్సహాలతో జరుపుకుంటారు. దీపావళి అంటేనే గుర్తుకు వచ్చేది టపాసులు. మూడు రోజుల పాటు సందడి ఉంటుంది. నందికొట్కూరు మున్సిపల్ పరిధిలో మొత్తం 8 బాణసంచా దుకాణాలకు దరఖాస్తులు చేసుకోగా రెవెన్యూ అధికారులు అనుమతులిచ్చారు. దీంతో సీఎస్‌ఐ సమాధుల తోటకు ఎదురుగా మైదానంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశారు.

నిబంధనలు పాటించని వ్యాపారులు

పట్టణంలోని ఏ దుకాణాదారుడు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. సాధారణంగా దుకాణాల వద్ద 200 లీటర్ల నీరు పట్టే డ్రమ్ములు అందుబాటులో ఉండాలి. నాలుగు ఇసుక బకెట్లను చెక్క స్టాండ్‌కు అమర్చుకోవాలి. మంటలు వ్యాపిస్తే ఆర్పేందుకు తొమ్మిది లీటర్ల ఎస్టింగ్విషర్స్‌ను దగ్గర ఉంచుకోవాలి. ఐదు కిలోల డ్రైకెమికల్ పౌడర్ సిద్ధం చేసుకోవాలి. దుకాణాలకు సమీపంలో వాహనాలను పార్కింగ్ చేయరాదు. దుకాణాల నడుమ మూడు మీటర్ల దూరం ఉండాలి. విద్యుత్ పరికరాలను దూరంగా ఉంచాలి. దుకాణం వద్ద పొగతాగరాదు. నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలి. కాలేగుణం ఉన్న వస్తువులను దుకాణాలకు దూరం ఉంచాలి. అయితే దుకాణాదారులు ఈ నిబంధలను తుంగలో తొక్కేసినా అధికారులు మామూళ్లు తీసుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాములపాడు: ఈ నెల 14 నుంచి స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14 నుంచి 20వ తేదీ వరకు రోజు వారీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 14న వారోత్సవాల ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి సంస్మరణ, 17,18 తేదీల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు, 19న ఇందిరా గాంధీ జయంతి వేడుకలు, 20న ముగింపు వేడుకలు ఉంటాయన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

పగిడ్యాల: మండల సాధారణ సర్వసభ్య సమావేశమును ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ శనివారం తెలిపారు. సమావేశానికి హాజరయ్యే మండల స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి నివేదికలను త్వరలో కార్యాలయ సూపరింటెండెంట్ నాగరాజ రావుకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల కో ఆప్షన్ సభ్యులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే అధికారులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు.

సారా విక్రేత అరెస్టు

నందికొట్కూరు: పట్టణ సమీపంలోని జమ్మిచెట్టు వద్ద కర్నూలు–గుంటూరు రహదారి పక్కన సారా విక్రయిస్తున్న చాంద్‌బాషాను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన చాంద్‌బాషా నాటు సారా తెచ్చి ఆత్మకూరు రోడ్డు పట్టణ సమీపంలో విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకునట్లు చెప్పారు.

కరువు మండలాల జాబితాలో చేర్చాలి

కొత్తపల్లి: సరైన వర్షాపాతం లేక పంటలు పూర్తి దెబ్బతిన్నాయని, మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చాలని కొత్తపల్లి మాజీ సర్పంచు శ్రీనాథరెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లమల అటవీ ప్రాంతానికి చేరువలో చిట్టచివరన ఉన్న మండలం కొత్తపల్లి అని తెలిపారు. మండలంలో సాధారణ సాగు భూమి 25 వేల ఎకరాలు ఉండగా ఖరీఫ్‌లో 22,737 ఎకరాలలో వివిధ రకాల పంటలు రైతులు సాగుచేసుకున్నారన్నారు. వర్షాభావ పరిస్థితులతో మొక్కజొన్న, పత్తి, మిరప, మినుము, పెసర ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. అయినా ఈ మండలాన్ని కరువుమండలంగా ప్రకటించకపోవడం బాధకరమన్నారు. అధికారులు పునరాలోచించి మండలాన్ని కరువుమండలాల జాబితాలో చేర్చాలని కోరారు.

'ప్రజా రక్షణ భేరి'ని జయప్రదం చేయండి

కొత్తపల్లి: అసమానతలు లేని అభివృద్ధి కోసం ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం మండల నాయకులు ఎన్ స్వాములు, ఎస్ సంజీవరాయుడు విజ్ఞప్తి చేశారు. శనివారం సింగరాజుపల్లె గ్రామంలో బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విభజన హామీ అమలు చేయకుండా తీవ్రంగా ద్రోహం చేసిందన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేసేందుకు పూనుకుందని, రాష్ట్ర అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు ఎన్ దాసు, ఎన్ దేవకుమార్, జి దాసు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

ఆత్మకూరు: విజయవాడ నగరంలో ఈ నెల 15న సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో శనివారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, మంజుల, మీనాకుమారి, రజాక్, స్వామన్న, నరసింహా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

- హైవే నిర్మాణంలో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పు
- ట్రాన్స్‌కో అధికారులకు సమాచారమివ్వని వైనం
- కాంక్రీటు వేయకుండా మట్టితో గుంతల పూడ్చివేత



రబ్బానిగోదాము సమీపంలో ఇష్టారాజ్యంగా పాతిన నూతన విద్యుత్ స్తంభాలు



కాంక్రీటు వేయకుండా మట్టితో పూడ్చిన గుంత

జూపాడుబంగ్లా: నేషనల్‌హైవే నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల మార్పు పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రాన్స్‌కో అధికారులకు తెలియజేయకుండా ఇష్టమొచ్చినట్లు స్తంభాలు పాతుతుండటంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు గాలికి..

నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఉన్న విద్యుత్ స్తంభాలను పెకలించి వాటి స్థానంలో పెద్ద స్తంభాలను ఏర్పాటుచేసే ప్రక్రియ ప్రారంభమైంది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ విద్యుత్‌స్తంభాల పెకలింపు, నూతన స్తంభాల ఏర్పాటు విషయమై జూపాడుబంగ్లా ట్రాన్స్‌కోకు ఎలాంటి సమాచారం, గైడెలెన్స్ వివరాలు తెలియజేయకపోవడంపై సంబంధిత కాంట్రాక్టర్‌పై ఏఈ రామాచారి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఐదుమీటర్లలోతు గుంత తవ్వి, విద్యుత్ స్తంభాన్ని పాతాలి, పాతిన స్తంభం వాలిపోకుండా గుంతలో కాంక్రీటువేసి పకడ్బందీగా గుంతను పూడ్చాల్సి ఉంటుంది. అయితే కాంట్రాక్టర్ ఎలాంటి సిమెంటు కాంక్రీటు వేయకుండానే ఒట్టిమట్టితో గుంతను పూడ్చివేస్తుండటంతో గాలి, వానల దాటికి స్తంభాలు నేలకొరిగే అవకాశం ఉందని విద్యుత్ సిబ్బంది పేర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకొని నిబంధనలను అనుసరించి నూతన విద్యుత్‌స్తంభాలను పాలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనులు నిలిపివేశాం

నూతన విద్యుత్‌స్తంభాల ఏర్పాటుకు సంబంధించిన గైడ్‌లెన్స్‌తో పాటు కాంట్రాక్టర్ ఇప్పటి దాకా మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అందుకే పనులు నిలిపివేశాం. ఇష్టారాజ్యంగా స్తంభాలు పాతి వదిలేస్తే తరువాత వచ్చే సమస్యలకు ఎవరు బాధ్యులు. సమగ్ర సమాచారం ఇచ్చిన తర్వాతనే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం.

– రామాచారి, ట్రాన్స్‌కో ఏఈ, జూపాడుబంగ్లా

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఎన్‌జీఓ అధ్యక్షుడు

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి చరిత్రలో నిలిచారని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈసీ కమిటీ సమావేశంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ఏపీ ఎన్‌జీఓ జిల్లా కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల మందికి పైగానే ప్రయోజనం చేకూరుతుందన్నారు. సీఎం రుణం తీర్చుకోలేనిదని చెప్పారు. ఉద్యోగులకు ఒకటి డీఏ విడుదల చేశారని, మిగత డీఏలు కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రతి ఉద్యోగికి ఇంటి స్థలం మంజూరు చేయాలని, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. విడతల వారీగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరిరెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి

నంద్యాల(వ్యవసాయం): మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తూ తెలుగు వైభవాన్ని చాటడమే సాహితీ స్రవంతి ధ్యేయమని సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంద్యాల రఘుబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో విద్య–సాహిత్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి సాహితీ స్రవంతి నిరంత కృషి చేస్తుందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, వ్యాస, కవిత, కథా రచన పోటీలు నిర్వహించడం వల్ల తెలుగుభాషపై పిల్లలకు అభిరుచి కలిగేలా ప్రోత్సహించవచ్చన్నారు. మాతృభాషలో విద్యాభ్యాసం వల్ల బోధించిన అంశాలను పిల్లలు సులభంగా గుర్తుంచుకోగలుగుతారని చెప్పారు. నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షులుగా అన్నెం శ్రీనివాస రెడ్డి, మాదాల శ్రీనివాసులు, మణిశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నీలం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా శేషఫణి, మహబూబ్‌బాషా, సరస్వతి కమిటీ సభ్యులుగా నీలకంఠ పరమాచారి, నరేంద్ర,రామచంద్రమూర్తి తదితరులను ఎంపిక చేసినట్లు వివరించారు. అనంతరం డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణను సన్మానించారు.

అవాస్తవాలు ప్రచురిస్తే చర్యలు

బొమ్మలసత్రం: దొంగను వదిలేశారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవమని, ఇలా అవాస్తవాలు ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. గత నెల 29న మతిస్థితిమితం సరిగా లేని వ్యక్తి కాలనీలో హల్‌చల్ సృష్టించాడు. స్థానికుల సమాచారం మేరకూ సీఐ నరసింహులు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. చాలా మంది మతి స్థితి మితం లేని వ్యక్తులు రైల్వేస్టేషన్ ప్రాంతంలో సంచరిస్తున్నారని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తి వివరాలు సేకరించి అతనిపై ఎలాంటి కేసులు లేనందున పోలీసులు వదిలేశారన్నారు. అధికారుల వివరణ లేకుండా ఇలాంటి వార్తలు ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టించటం సరికాదన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో త్వరలో జరగనున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ప్రతి విద్యార్థి కళాశాల వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1969లో కళాశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఇక్కడ విద్యనభ్యసించిన ప్రతి విద్యార్థి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న వివరాల ద్వారా సమావేశ వివరాలు తెలియజేస్తామన్నారు. వివరాలను https://gdcnandyal.ac,in/alumregform. php లో నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు కే.శ్రీనివాసులు సెల్ 9866418418, శివకుమార్ రెడ్డి – 940878658 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నందికొట్కూరు: విద్యా జ్ఞాపకాలు మరవలేనివని పూర్వ విద్యార్థులు సతీష్‌కుమార్, మల్లికార్జునరెడ్డి, వేదవాస్ అన్నారు. పట్టణంలోని సీఎస్‌ఐ ఎయిడెడ్ హైస్కూల్ 1990–91 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శనివారం పాఠశాల ఆవరణలో జరిగింది. పూర్వ విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటరమణ, శ్రీధర్‌రెడ్డి, సత్యం, శేఖర్ రెడ్డి, నోవజార్జి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

■ కంకులు కళకళ



బండినాయునిపాలెం గ్రామ సమీపంలో కంకులు విడిచిన వరి పైరు

కొత్తపల్లి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సమయానికి రైతన్నలు మండలంలో వరిని సాగుచేసుకున్నారు. రైతన్నలు ఆరుగాలం కష్టపడి పంటలు సాగుచేసుకోవడంతో ప్రస్తుతం పంటలు కంకి దశకు చేరుకొని కళకళలాడుతున్నాయి. మండలంలో సుమారు 30కి పైగా గ్రామాలు ఉన్న కేవలం 5,6 గ్రామాలలో మాత్రమే వరిపంటను రైతులు సాగు చేశారు. గువ్వలకుంట్ల, వీరాపురం, కొత్తపల్లి, శివపురం, గుమ్మడాపురం, బావాపురం, నందికుంట, గ్రామాల రైతులు ఆయా చెరువుల కింద 984 హెక్టార్లలో పంటను వేశారు. సుమారు 5 నెలలు రైతన్నలు వరి సాగును కంటికి రెప్పలా కపాడుకుంటు అవసరమైనప్పుడు రసాయన ఎరువులు, తెగుళ్ల నివారణకు రసాయన మందులు పిచికారీ చేస్తూ వచ్చారు. రైతు కష్టానికి ఫలితంగా ప్రస్తుతం వరి పంటలు కంకి విడుపు దశకు చేరుకున్నాయి. పంటలు కంకులతో కళకళలాడుతున్నాయి. కొన్ని పొలాల్లో కంకి విడిచినవి ఎండుదశకు రావడంతో రైతన్నలు కోతకు సిద్ధం అవుతున్నారు. అలస్యంగా వేసుకొన్న పంటలు సైతం పచ్చదనంతో పులకరిస్తున్నాయి.



వీరాపురం గ్రామ సమీపంలో కంకులతో కళకళలాడుతున్న వరిపొలాలు

మౌలానా సేవలు మరువలేని



మౌలానా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కాలేజి రోడ్డులో ఆవాజ్ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన శనివారం జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా స్థానిక కాలేజీ రోడ్డులోని స్థూపం వద్ద ఆవాజ్ కమిటి ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలను గుర్తించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో శాప్ జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఉస్మాన్ బేగ్, జేసీఎస్ కన్వీనర్ అబుబక్కర్, నాయకులు జబ్బార్, రజినీకుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, అవాజ్ కమిటీ సభ్యులు అబ్దుల్లా, అబ్దుల్ రహిమాన్, హాషం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఏవైఎస్‌ఏ కార్యాలయంలో శనివారం భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏవైఎస్‌ఏ నాయకులు అన్వర్, ముస్తఫా మాట్లాడుతూ భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్‌కలాం విద్యాభివృద్ధి కోసం అహర్నిషలు కృష చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏవైఎస్‌ఏ నాయకులు షాలుపైల్మాన్, షబ్బీర్, సలాం, గఫూర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.